## క్లుప్తంగా

### జెడ్పీ చైర్‌పర్సన్‌పై దాడి దారుణం

**తోట్లవల్లూరు (పామర్రు):** బీసీ మహిళ, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఉప్పాల హారికపై కూటమి నేతలు దాడి చేయడం దారుణమని వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు తాడిశెట్టి శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అసలు రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా అని ప్రశ్నించారు. ఒక మహిళను నడిరోడ్డుపై అవమానపర్చటం, అసభ్య పదజాలంతో దూషించడం అనేది ఒక అమానుష చర్య అన్నారు. బాధ్యతాయుతమైన ఒక జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా ఉన్న ఆమెపై ఇంత జరిగినా సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్, డెప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మాట్లాడకపోవడం దారుణం అన్నారు. ఏపీలో మహిళలకు రక్షణ కరువైందనే విషయం ఈ సంఘటన ద్వారా మరోసారి రుజువైందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జెడ్పీ చైర్‌పర్సన్‌పై దాడి చేసిన వారికి వెంటనే శిక్ష పడేలా చర్యలు తీసుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలన్నారు. లేనిపక్షంలో ట్రేడ్ యూనియన్ తరపున జిల్లాలో పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు.

### పీ4 మార్గదర్శికి సత్కారం

**గుడివాడరూరల్:** ప్రభుత్వం నిర్వహిస్తున్న పీ4 కార్యక్రమంలో భాగంగా పశు సంవర్థకశాఖకు మండలంలోని దొండపాడు గ్రామానికి చెందిన ఉప్పల ప్రవీణ్‌కుమార్ మార్గదర్శిగా నమోదయ్యారు. దొండపాడులోని పశువులకు 200డోసులు వేసేందుకు రూ.30వేలు ఉచితంగా అందించారు. ఈ క్రమంలో మంగళవారం ప్రవీణ్‌ను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అభినందించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ జేడీ డాక్టర్ ఎన్‌సీహెచ్ నరసింహులు, ఉప సంచాలకులు శ్రీనివాస్, ఎంపీడీఓ విష్ణుప్రసాద్, పశు వైద్యాధికారి వి.హనుమంతరావు పాల్గొన్నారు.

### వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు



**గుడివాడరూరల్:** పట్టణంలోని పెద్దవీధికి చెందిన ఓ వ్యక్తి అదృశ్యంపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో బాధితుడి కుటుంబ సభ్యులు మంగళవారం ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం మేరకు పట్టణంలోని పెద్దవీధికి చెందిన మరడా సాంబశివరావు ఈ నెల 8వ తేదీన ఉదయం ఇంటి నుంచి ఉంగుటూరులో ఉంటున్న తన పెద్ద కొడుకు ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లాడు. అప్పటి నుంచి ఇంటికి తిరిగి రాలేదు. ఎడమ కాలు విరగడం వలన సాంబశివరావు కుంటుతూ నడుస్తాడు. ఆ వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు వన్‌టౌన్ పోలీసులకు 83329 83796కు తెలియజేయాలని కోరారు.

### ఆటో బోల్తా.. ఇద్దరికి తీవ్ర గాయాలు



**తోట్లవల్లూరు (పామర్రు):** పామర్రు–దిగమర్రు జాతీయ రహదారిలో ఆటో అదుపు తప్పి పక్కనే ఉన్న కాలువలో బోల్తా పడిన సంఘటన పామర్రు మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు గుడివాడ నుంచి పామర్రు వైపు 10 మందికి పైగా ప్రయాణికులతో వస్తున్న ఆటో కొమరవోలు వద్దకు రాగానే అదుపు తప్పింది. పక్కనే ఉన్న పంట కాలువలోకి ఆటో బోల్తా కొట్టింది. కాలువలో నీరు అధికంగా ప్రవహిస్తోంది. స్థానికులు స్పందించి వెంటనే ఆటోలోని వారికి బయటకు లాగారు. ఈ సంఘటనలో ఆటోలో ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎనిమిది మందికి స్వల్పంగా గాయపడ్డారు. బాధితులను 108 వాహనంలో గుడివాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సంఘటన స్థలాన్ని పామర్రు ఎస్‌ఐ రాజేంద్రప్రసాద్ పరిశీలించారు. ఈ ప్రమాదంలో అవనిగడ్డ జూనియర్ కళాశాల లెక్చరర్ ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

### సబ్సిడీపై డ్రోన్ అందజేత



**కలిదిండి(కైకలూరు):** డ్రోన్ పరిజ్ఞానాన్ని వ్యవసాయ రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలిదిండి మండల వ్యవసాయాధికారి విద్యాసాగర్ పేర్కొన్నారు. కోరుకొల్లు గ్రామంలో రైతు సాయిరామ్‌కు సబ్సిడీపై డ్రోన్‌ను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ యంత్ర పరికరాల పంపిణీలో భాగంగా 80 శాతం రాయితీతో డ్రోగో డ్రోన్స్, కృషి–3 డ్రోను అందిస్తున్నామన్నారు. మండలంలో ఇప్పటికే ఇద్దరికి వీటిని అందించామన్నారు. మొత్తం డ్రోన్ ఖరీదు రూ.9,80,000 ఉండగా 80 శాతం సబ్సిడీ పోను కేవలం రూ.2 లక్షలు మాత్రమే రైతు చెల్లించాలన్నారు. డ్రోన్ వాడకంలో ఉచిత శిక్షణకు ఒక్కో వ్యక్తికి 15 రోజులకు రూ.75,000 ప్రభుత్వం ఖర్చు చేస్తోందన్నారు. డ్రోన్ వాడకం వలన కూలీల కొరతను అధిగమించడంతో పాటు, రసాయనాల ద్వారా మనుషులకు ఏర్పడే వ్యాధులను అరికట్టొచ్చన్నారు. సబ్సిడీపై డ్రోన్లు తీసుకోడానికి రైతులు, యువత ముందుకు రావాలని ఏఓ కోరారు.

# తాగునీటి చెరువులు కలుషితం



చావలిపాడు తాగునీటి చెరువు

**మండవల్లి:** మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి చెరువులు కలుషితమై ప్రజలు మంచినీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. చావలిపాడు, దెయ్యంపాడు తదితర గ్రామాల్లోని చెరువుల్లో నీటిని ప్రజలు తాగడానికి వినియోగించుకోవడం లేదు. నీరు పూర్తిగా కలుషితం కావడంతో ఈ నీటిని గత 15 ఏళ్ల నుంచి తాగడానికి వినియోగించడం లేదు. ఈ నీటిని వినియోగిస్తే ఎక్కడ ఆరోగ్య సమస్యలు వస్తాయోనని ఆందోళన చెందుతున్నారు. ప్రజలకు ఏ లోటు లేకుండా చూస్తామన్న కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు.

**వాడకానికి చెరువులో నీరు**

మంచినీటి చెరువుల్లో నీటిని వాడుకోవడానికి మాత్రమే ఉపయోగిస్తున్నారు. తాగునీటి కోసం మార్కెట్‌లో విక్రయించే క్యాన్లను ఒక్కటి రూ.20 నుంచి రూ.25 కొనుగోలు చేస్తున్నారు. ఆర్థిక స్తోమత లేని కుటుంబాలు కలుషిత నీరు తాగి ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తాగునీటి చెరువులను అభివృద్ధి చేసి స్వచ్ఛమైన మంచి నీటి సరఫరాకు కృషి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

**కొత్త మైక్రోఫిల్టర్ వేయాలి**

రక్షిత తాగునీటి పథకానికి ఉన్న మైక్రోఫిల్టర్ దెబ్బతింది. ఈ కారణంగా నీరు కలుషితం అవుతోంది. కొత్తగా మైక్రోఫిల్టర్ వేస్తే సమస్య పరిష్కారం అవుతుంది.

–కొండలు, కార్యదర్శి, చావలిపాడు

**తాగునీటిని కొంటున్నాం**



గ్రామంలో మంచినీటి చెరువు అలంకారప్రాయంగా మాత్రమే ఉంది. ఈ చెరువు నీటిని గ్రామస్తులు తాగడానికి ఉపయోగించడం లేదు. బయట మార్కెట్‌లో నీటిని కొనుగోలు చేసి, ఆ నీటిని వంటలకు, తాగడానికి వినియోగిస్తున్నారు.

–నాగరాజు, చావలిపాడు

**చెరువును ప్రక్షాళన చేయాలి**



మంచినీటి చెరువుల్లో నీరు తాగడానికి పనికి రావడం లేదు. దీంతో వాటర్ ప్లాంట్లలో నీటిని కనుగోలు చేసి తాగుతున్నాం. ఏళ్ల తరబడి ఇదే వ్యవహారం సాగుతోంది. పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా ఫలితం లేదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి చెరువును ప్రక్షాళన చేయాలి.

–రామయ్య, దెయ్యంపాడు

# నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



కైకలూరు ఏటూజడ్ పురుగు మందుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న విజిలెన్సు బృందం



కలిదిండిలో మారుతీ రామా ట్రేడర్స్ గోడౌన్‌ను పరిశీలిస్తున్న విజిలెన్స్, వ్యవసాయాధికారులు

**కైకలూరు:** ఎరువులు, పురుగు మందులు, ఆక్వా విక్రయ దుకాణదారులు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని రాజమండ్రి విజిలెన్స్ డీఎస్పీ ఎస్.తాతారావు హెచ్చరించారు. నియోజకవర్గంలో కైకలూరు, కలిదిండి, మండవల్లి మండలాల్లో పలు దుకాణాలను సహచర బృందంతో కలిసి మంగళవారం తనిఖీలు నిర్వహించారు. కైకలూరు సంత మార్కెట్ వద్ద ఏ టూ జెడ్, వాసవీ ఆక్వా ట్రేడర్స్‌లో తనిఖీలు చేయగా ఆక్వా ఉత్పత్తులు, పురుగు మందులు ఒకేచోట విక్రయాలు చేయడంపై అభ్యంతరం తెలిపారు. ఆక్వా మందులను విడిగా విక్రయించని కారణంగా రూ.8.62 లక్షల విలువ గల పురుగు మందుల విక్రయాలు నిలుపుదల చేశారు. అదేవిధంగా కలిదిండి మండలం కలిదిండిలో మారుతీ రామ ట్రేడర్స్‌లో ఫాం ఓ సమర్పించని కారణంగా రూ.20,780 విలువ చేసే 2.8 మెట్రిక్ టన్నుల ఎస్‌ఎస్‌పీ ఎరువుల విక్రయాలను ఆపారు. అనంతరం అమర్ ఎంటర్ ప్రైజెస్‌లో సరైన రశీదులు, వివరాలు లేని కారణంగా రూ.9,000 విలువ చేసే 20 లీటర్ల కలుపు నివారణ మందు విక్రయాలను నిలుపుదల చేశారు. మండవల్లి మండలం లోకుమూడిలో రాజరాజేశ్వరీ ఎరువుల దుకాణంలో తనిఖీలు చేశారు. కొనుగోలు చేసిన ప్రతి రైతుకు బిల్లును తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. ఎమ్మార్పీకే విక్రయించాలన్నారు. అనుమతులు లేని ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా అనపర్తి, ఏలూరు, మండవల్లి వ్యవసాయ సహాయ సంచాలకులు డీవీ కృష్ణ, ఇ.అనిల్‌కుమారి, జి.వెంకటమణి, కైకలూరు, కలిదిండి మండల వ్యవసాయాధికారులు ఆర్.దివ్య, విద్యాసాగర్ పాల్గొన్నారు.

### చినముత్తేవి పీఏసీఎస్ అధ్యక్షుడిగా ప్రకాష్



**చినముత్తేవి(మొవ్వ):** మొవ్వ మండలం చిన ముత్తేవి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడిగా కొసరాజు ప్రకాష్ మాధుర్ (పెదముత్తేవి)ను ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ముగ్గురు సభ్యులతో కూడిన ఈ కమిటీలో డైరెక్టర్లుగా మురారి శివనాగరాజు, సుంకర వెంకటేశ్వరరావును నియమితులయ్యారు.

### సుబ్బారాయుడికి అభిషేకాలు



**ముదినేపల్లి రూరల్:** ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో స్వామికి మంగళవారం అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్రశర్మ ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి అనేక మంది భక్తులు ఆలయానికి చేరుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా నిత్యాన్నదాన ప్రసాదానికి సంబంధించి అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. ఆలయ ఈఓ ఆర్.గంగా శ్రీదేవి పర్యవేక్షించారు.

### దరఖాస్తుల ఆహ్వానం

**తోట్లవల్లూరు:** పెనమకూరు ఆయుర్వేద వైద్యశాల్లో పార్ట్‌టైం యోగా శిక్షకుడి నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి వైద్యాధికారి డాక్టర్ బి. ప్రసన్న ఒక ప్రకటనలో తెలిపారు. పురుష యోగా శిక్షకుడి గౌరవ వేతనం గంటకు రూ.250 అని, నెలలో 32 గంటలపాటు ఆయుర్వేద వైద్యశాల, సమీపంలోని పాఠశాలల్లో యోగా నేర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అర్హులైన వారు తమ విద్యార్హతల సర్టిఫికెట్లతో ఈ నెల 21వ తేదీ ఉదయం 11 గంటలకు హాస్పిటల్లో నిర్వహించనున్న ఇంటర్వ్యూకు హాజరు కావాలని డాక్టర్ ప్రసన్న కోరారు.

### అభయాంజనేయ సన్నిధిలో అన్నదానం

**హనుమాన్‌జంక్షన్‌రూరల్:** స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో విశేష పూజలు, అన్నదానం నిర్వహించారు. స్వామి వారికి పీత్రిపాత్రమైన మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి హనుమంతుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి తమలపాకులతో ప్రత్యేక పూజలు వైభవంగా జరిగాయి. ఆలయ ప్రాంగణంలో దాతలు పల్లె దుర్గారావు, ఆయన సోదరుల సహకారంతో 200 మంది భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

### 'నేను బడికి పోతా' ర్యాలీలు



ర్యాలీ చేస్తున్న వైవాక శివారు పెదగరువు పాఠశాల విద్యార్థులు

**ముదినేపల్లి రూరల్:** మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు 'నేను బడికి పోతా' కార్యక్రమానికి సంబంధించి మంగళవారం ర్యాలీలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులు అవగాహన కల్పించేందుకు ప్రవేశాల సంఖ్య పెంచేందుకు ర్యాలీలు నిర్వహించాలని విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. ఈ మేరకు ఉపాధ్యాయులు ప్లకార్డులు తయారు చేసి విద్యార్థులతో ర్యాలీలు చేయించారు. ఈ సందర్భంగా చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అర్హులైన ఉపాధ్యాయులతో బోధన జరుగుతుందని పేర్కొన్నారు. ఉచితంగా విద్య దొరుకుతుందని, తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలల వైపు మొగ్గు చూపొద్దన్నారు.

### అమ్మవార్లకు ఆషాఢ సారె



కైకలూరులో సారె సమర్పించేందుకు వెళుతున్న భక్తులు

**కైకలూరు:** ఆషాఢ మాసం సందర్భంగా చిన్న చెరువు గట్టు వల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ మహిళా భక్తులు కైకలూరులో పలు అమ్మవార్లకు ఆషాఢ సారెను మంగళవారం సమర్పించారు. సుబ్రహ్మణ్యేశ్వర గుడి నుంచి సారెను వందలాది మంది మహిళలు శ్యామలాంబ దేవస్థానంలో పార్వతీమాతకు, మీసాల వెంకన్నస్వామి గుడిలో భూదేవి మాతకు, ఏఎంసీ వద్ద దుర్గమాత, బైపాస్ రోడ్డు గంగానమ్మకు సారెను సమర్పించారు. కార్యక్రమంలో భక్తులు రమణకుమారి, రాజేశ్వరీ, తులసి, రమాప్రియా, రాధిక తదితరులు పాల్గొన్నారు.

### రోడ్ల వెంబడి చెత్తతో దుర్గంధం




కుదరవల్లి గ్రామంలో గుంతలో వేసిన చెత్త



ఇలపర్రులో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త

**నందివాడ:** మండలంలోని పలు గ్రామాల్లో రోడ్ల వెంబడే చెత్త వేస్తుండడంతో దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని, ఇలపర్రు, కుదరవల్లి, తుమ్మలపల్లి, పెదలింగాల, అరిపిరాల తదితర గ్రామాల్లో రోడ్ల వెంబడి చెత్త కుప్పలతో కంపు కొడుతున్నాయి. అదేవిధంగా డ్రెయినేజీల్లో పూడిక పేరుకుపోయి మురుగునీరు నిల్వ ఉండి దోమలు విజృంభిస్తున్నాయి. సమస్యను పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందన లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి వెంటనే పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

### గుర్రపుడెక్కను తొలగించరూ!



**పమిడిముక్కల:** పుల్లేరు కాలువలో గుర్రపుడెక్క మేటవేసింది. మంటాడ శివాలయం, మంటాడ వెంకటేశ్వరస్వామి దేవస్థానం, గురజాడ వంతెన వద్ద కాలువంతా గుర్రపుడెక్క అల్లుకుపోయింది. ఈ కాలువ ద్వారా వేలాది ఎకరాలకు సాగునీరు సరఫరా కావాల్సి ఉంది. ఈ సమస్యపై ఇటీవల సాక్షిలో వార్త ప్రచురించడంతో ఇటీవల ఇరిగేషన్ అధికారులు డ్రోన్ ద్వారా మందు పిచికారీ చేశారు. గుర్రపుడెక్క మాడిపోయింది. గుర్రపుడెక్కను బయటకు తీయకుండా అలాగే వదిలేశారు. సాగునీటి ప్రవాహానికి అడ్డంకిగా మారింది. కాలువలోని గుర్రపుడెక్కను పూర్తిగా తొలగించాలని రైతులు కోరుతున్నారు.

# కొడాలి నానిని పరామర్శించిన కఠారి



కొడాలి నానిని ఆలింగనం చేసుకున్న కఠారి ఈశ్వర్‌కుమార్

**గుడివాడ టౌన్:** గుడివాడ రాజకీయాల్లో ఆసక్తికరమైన పరిణామాలు మంగళవారం చోటుచేసుకున్నాయి. ఒకప్పటి రాజకీయ ప్రత్యర్థులు పరస్పరం ఆలింగనం చేసుకున్నారు. గుడివాడ మాజీ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని)ని మాజీ మంత్రి, సీనియర్ రాజకీయ నాయకులు కఠారి ఈశ్వర్‌కుమార్ మంగళవారం ఆయన నివాసంలో కలిసి ఆలింగనం చేసుకున్నారు. అనారోగ్యంతో శస్త్రచికిత్స చేసుకున్న కొడాలి నానిని ఆయన పరామర్శించి, ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. నాటి తరం, నేటి తరం రాజకీయ లెజెండ్‌లు అయిన కఠారి ఈశ్వర్‌కుమార్, కొడాలి నానిల కలయిక వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. అనంతరం ఈశ్వర్‌కుమార్ మాట్లాడుతూ తాను కొడాలి నానికి భేషరతుగా మద్దతు ఇస్తున్నానని ప్రకటించారు. అనంతరం కొడాలి నానితో కలిసి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. షరతులతో కూడిన బెయిల్‌లో ఉన్న కొడాలి నాని పోలీస్ స్టేషన్‌లో సంతకం అనంతరం కొడాలి నాని వెళ్లిపోయారు. ఈశ్వర్‌కుమార్ రైతు బజారు సెంటర్‌లో మీడియాతో మాట్లాడారు. 2024 ఎన్నికల్లో తాను రెండు ఓట్లు కూటమి నాయకులకు వేశానన్నారు. ఎన్నికల అనంతరం ఇప్పటి వరకు తాను తటస్థంగా ఉన్నానని తెలిపారు. ఏ పార్టీకి మద్దతుగా లేనన్నారు. గుడివాడలో టీడీపీ గూండాలు చేస్తున్న అరాచకాలను గతంలోనే తాను మీడియా సమక్షంలో ప్రశ్నించానన్నారు. ఎమ్మెల్యే రాముకు ఫోన్ చేసి ఇది సరైన పద్ధతి కాదని చెప్పానన్నారు. అయినా వారిలో మార్పు రాలేదన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలపై దాడులు పెరిగాయన్నారు. టీడీపీ గూండాలు చేస్తున్న అరాచకాలను ఖండిస్తూ కొడాలి నానికి తాను పూర్తి మద్దతు ప్రకటిస్తున్నానన్నారు. గుడివాడలో పోలీసులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని నియోజకవర్గంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలపై దాడులు చేస్తే బాధితులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

# భూ సారాన్ని బట్టి ఎరువుల మోతాదు నిర్ణయం



పసుమర్రులో రైతులతో మాట్లాడుతున్న ఏఓ జ్యోతిరమణి

**తోట్లవల్లూరు (పామర్రు):** భూ సారాన్ని బట్టి రసాయనిక ఎరువుల మోతాదుని నిర్ణయించి సాగు చేస్తే అధిక దిగుబడులు వస్తాయని మచిలీపట్నం డీఆర్‌సీ, డీటీసీ కె.జ్యోతిరమణి పేర్కొన్నారు. మండలంలోని పసుమర్రు, పెరిశేపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరిలో ఎరువుల యాజమాన్యం గురించి రైతులకు వివరించామన్నారు, నత్రజని, భాస్వరం, పొటాష్, జింక్‌ను ఇచ్చే ఎరువులను సమతుల్యంగా వాడాలన్నారు. వరి మాగాణుల్లో జీలుగ, జనుము, పిల్లి పెసర లాంటి పచ్చి రొట్ట పైర్లను పెంచి కలియదున్నటం ద్వారా భూసారం పెరుగుతుందన్నారు. అంతేకాకుండా సుమారు 20–25శాతం నత్రజని, భాస్వరం, పొటాష్‌ను కూడా ఆదా చేయవచ్చని తెలిపారు. పామర్రు ఏడీఏ స్వర్ణలత మాట్లాడుతూ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పంటల బీమా పథకం గురించి వివరించారు. వరి పొలానికి ఒక ఎకరానికి రూ.830 ప్రీమియం ఆగస్టు 15వ తేదీ లోపుగా చెల్లించాలని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌సీ ఏఓ పద్మజ, పామర్రు ఏఓ శివనాగరాణి పాల్గొన్నారు.

# లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకుల ధర్నా



ధర్నా చేస్తున్న వాహనాల యజమానులు

**గుడివాడ టౌన్:** వాహనాలు బ్రేక్ చేసే విధానాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడం దుర్మార్గపు చర్య అని లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు అన్నారు. మంగళవారం గుడివాడ ఆర్టీఓ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఉద్యోగులను కార్యాలయంలోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గుడివాడ ఆర్టీఓ కార్యాలయ పరిధిలో ఏడు వేల ప్రైవేట్ వాహనాలు బ్రేక్ చేయాల్సి ఉందన్నారు. పట్టణానికి 70 కిలోమీటర్ల దూరంలో బ్రేక్ సెంటర్ ఏర్పాటు చేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గుడివాడ ఆర్టీఓ కార్యాలయంలోనే బ్రేక్‌చేసి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని కోరారు. ప్రైవేట్ వ్యక్తులకు వ్యవస్థను అప్పగించే విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

# కేసుల పరిష్కారంలో రాజీమార్గమే మేలు



మధ్యవర్తిత్వం కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించిన జూనియర్ జడ్జి శివకిరణ్, న్యాయవాదులు

**కైకలూరు:** కోర్టు పెండింగ్ కేసుల పరిష్కారంలో మధ్యవర్తిత్వంతో రాజీ చేసుకోవడమే సరైన మార్గమని కైకలూరు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఎం.శివకిరణ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టు ఆదేశాలతో దేశం కోసం–మధ్యవర్తిత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కోర్టు నుంచి ప్రభుత్వాస్పత్రి వరకు న్యాయవాదులతో కలిసి మంగళవారం ర్యాలీ చేశారు. అనంతరం జడ్జి మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సూచన మేరకు మండల న్యాయ సేవాధికార కమిటీ ఆధ్వర్యంలో కైకలూరు కోర్టులో మీడియేషన్ సెంటర్‌ను ప్రారంభించామన్నారు. ఇందుకోసం న్యాయవాదులు మాడెం సత్యనారాయణ. కుమ్మరిగుంట కోటయ్య, దేవరపల్లి శివప్రసాద్ మీడియేటర్లుగా శిక్షణ పొందారన్నారు. కోర్టులో పెండింగ్ కేసుల కారణంగా తీర్పు అలస్యమవుతోందన్నారు. ఇటువంటి సమయంలో మీడియేషన్ సెంటర్ ఏర్పాటు కక్షిదారులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సివిల్, క్రిమినల్, చెక్‌బౌన్స్, ఇన్సూరెన్స్ వంటి కేసులను ఇరు పక్షాలు స్నేహపూర్వక వాతావరణంలో పరిష్కరించుకునే వీలుంటుందన్నారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి 90 రోజులు మీడియేషన్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు వి.శ్రీరామచంద్రమూర్తి, పి.పవన్‌కాంత్, డి.శ్యాం ప్రసాద్, జి.జితేందర్, డి.గంగాధరరావు, వి.సాయి సత్యనారాయణ, సీహెచ్ శంకర్‌శాస్త్రి, సీహెచ్ వెంకటప్పయ్య, బందెల లక్ష్మణరావు, కె.రమాదేవి, ఎండీ రజీమున్నిసా, పారా లీగల్ వలంటీర్లు, కోర్టు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మురుగు నీటితో కాలనీవాసుల ఇక్కట్లు



ఉనికిలి ఎస్సీ కాలనీలోకి చేరుతున్న డ్రెయినేజీ నీటితో చేరుతున్న వర్షపు నీరు

**మండవల్లి:** మండలంలోని ఉనికిలి ఎస్సీ కాలనీలో డ్రెయినేజీ నీరు, వర్షపు నీరు కలిసిన నీటితో పలు సమస్యలు ఎదుర్కొంటున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. పంచాయతీ అధికారులకు చెప్పినా ఇప్పటి వరకూ ఎలాటి చర్యలు చేపట్టలేదని చెబుతున్నారు. ఎప్పటి నుంచో ఈ సమస్య ఇలా ఉందని పేర్కొంటున్నారు. ఆ మురుగు నీటిలో నుంచి రాకపోకలు సాగించడం ఇబ్బందిగా ఉందని చెబుతున్నారు. పక్కనున్న ఒక వ్యక్తి ఆ నీరు వెళ్లకుండా గట్టు వేశారన్నారు. దీంతో ఆ నీరు బోదెలోకి వెళ్లడం లేదన్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆసిలేటి ఫ్రాన్సిస్, ఆసిలేటి సంసోను, మన్నేపల్లి జైపాల్, సైమన్, సంజీవరావు తదితరులు కోరారు.